అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కుత్బుల్లాపూర్ :అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శ్రీనాథ్ (25) గుండ్లపోచంపల్లిలోని ఓంశ్రీ గెలాక్సీ సంస్థకు చెందిన నిర్మాణ దశలోని అపార్ట్‌మెంట్‌లో కూలీ పనులు చేస్తూ.. అక్కడే ఉంటున్నాడు. సోమవారం అర్ధరాత్రి పైనుంచి కింద పడడంతో కాంపౌండ్ వాల్‌కున్న రాడ్లు షర్టుకు తట్టుకొని ఊపిరాడక మృతి చెందాడు. తోటి కార్మికుడు దినేశ్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిర్మాణాలు జరిగే ప్రదేశానికి దూరంగా షెడ్లు వేసి, సదుపాయాలు కల్పించాల్సి ఉన్నది. యాజమాన్యం నిర్మాణంలో ఉన్న అంతస్తులో ఉంచడం గమనార్హం. మృతుడు మద్యం సేవించి పైకి ఎందుకు వెళ్లాడో ప్రశ్నార్థకం. తోటి కార్మికులు పట్టించుకోకపోవడంపై అనుమానాలకు తావిస్తున్నది. సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంట్లో నుంచి తప్పిపోయి చెరువులో మృతదేహంగా..

కుత్బుల్లాపూర్ : ఇంట్లో నుంచి తప్పిపోయిన ఓ వృద్ధురాలు చెరువులో మృతదేహం లభ్యమైన ఘటన పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలో మంగళవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం, చంద్రగిరి నగర్‌కు చెందిన బాదలి లక్ష్మి (59) మతిస్థిమితం లేక బాధపడుతున్నది. కల్లు సేవించే అలవాటు ఉన్నది. ఇటీవల రామ్‌రెడ్డి నగర్‌లోని తన తమ్ముడు ఇంటికి వెళ్లింది. ఈనెల 22న మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులను వాకాబు చేసిన ఫలితం లేక పోవడంతో, మాద్యమాల ద్వారా ఫొటోను పోస్ట్ చేశారు. మంగళవారం ఉదయం ఫాక్సిసాగర్‌లో జాలర్లు వృద్ధురాలి మృతదేహం తేలినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి సామాజిక మాద్యమంలో సమాచారం మేరకు బాధిత కుటుంబానికి వివరాలు చేరవేశారు. కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి వచ్చి నిర్ధారించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లింగంపల్లి రైల్వేస్టేషన్ పరిశీలన

దక్షిణ మధ్య రైల్వే జీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న రామస్వామి యాదవ్

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 25 : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మంగళవారం సాయంత్రం లింగంపల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించారు సౌకర్యాలు, వసతులు, ప్రయాణికుల ఇబ్బందులు , ప్లాట్ ఫాంల వివరాలు, పార్కింగ్ సదుపాయాలను పరిశీలించారు. లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేయనున్నట్లు జీఎం పేర్కొన్నారు.

జీఎంకు సమస్యలపై వినతి..

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌కు శేరిలింగంపల్లి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ వినతిపత్రం సమర్పించారు . రాజ్కోట్, హుస్సేన్ సాగర్ ఎక్స్‌ప్రెస్‌లను లింగంపల్లి లో ఆపాలని, వికారాబాద్ గుంటూరు మధ్య నడిచే పల్నాడు ఎక్స్‌ప్రెస్‌ను తెనాలి వరకు పొడిగించాలని, లింగంపల్లి వైజాగ్ మధ్య నడిచే జన్మభూమిఎక్స్‌ప్రెస్ దుగ్గిరాల స్టేషన్ లో ఆపాలని, ఉదయం 10 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ఎంఎంటీఎస్ రైళ్లను మళ్లీ పునరుద్ధరించాలని, లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో నాలుగవ ప్లాట్‌ఫాం వైపు వెళ్లే ప్రయాణికులకు లిఫ్ట్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

కొండాపూర్ : ప్రభుత్వం టీఎస్ ఈ-పాస్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందేలా చూడడంలో నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా విఫలమైంది. మూడేండ్లుగా బీసీ విద్యార్థులు ఎదురుచూస్తుండగా, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రెండేండ్లుగా అందుకోలేనట్లు స్టూడెంట్ యూనియన్ ప్రతినిధులు పేర్కొన్నారు. మెస్ ఛార్జీలు చెల్లించలేక, ఇతరత్రా అవసరాలను తీర్చుకోలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తు చేశారు.

అక్రమ షెడ్డు నిర్మాణం కూల్చివేత

కుత్బుల్లాపూర్ : కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల డివిజన్ పైపులైన్ రోడ్డు మార్గంలో ' ఒకవైపు రోడ్డు వెడల్పు.. మరోవైపు అక్రమ నిర్మాణాలు ' శీర్షికపై నమస్తే తెలంగాణలో వెలువడిన కథనం ప్రకారం జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందించారు. సంబంధిత టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భారీ అక్రమ షెడ్డును మంగళవారం పూర్తిగా కూల్చివేశారు.

అల్లాపూర్ : మోతీనగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు రామునాయక్ తల్లి అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్‌కుమార్‌తో కలిసి రామునాయక్ ఇంటికి వెళ్లి, ఆయన తల్లి పార్థివదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

కేపీహెచ్‌బీ కాలనీ : క్రీడలతో శారీరక , మానసిక ఉల్లాసం కలుగుతుందని మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు అన్నారు. మంగళవారం 9వ ఫేజ్ గ్రౌండ్‌లో తెలంగాణ జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలను ప్రారంభించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. పోటీల్లో గెలుపు ఓటములు సహజమని.. స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ప్రతిఒక్కరూ ఆటలకు సమమం కేటాయించాని

పోటీలను ప్రారంభిస్తున్న బాబురావు

సూచించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ మీట్ నిర్వాహకుడు జిల్లా అక్షయ్, సుకుమార్, అహ్మద్, వర్షిత్, రాధ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు.. అభినందనీయం

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 25 : సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కేపీహెచ్‌బీ కాలనీ సీఐ రాజశేఖర్ రెడ్డి అన్నారు. 9వ పేజ్ లోని సిద్ధి వినాయక ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వ్యవస్థను మంగళవారం సీఐ ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బస్‌స్టాప్‌ను పునరుద్ధరించాలి

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ అలీకి వినతిపత్రం అందజేస్తున్న రాజీవ్‌గాంధీ నగర్ వాసులు

దుండిగల్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, బాచుపల్లి రాజీవ్ గాంధీ నగర్ లోని బస్‌స్టాప్‌ను పునరుద్ధరించాలని స్థానికులు మంగళవారం కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ ఆలీని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. నిజాంపేట కార్పొరేషన్ పరిధిలోని 16, 20వ డివిజన్లు కు సంబంధించి కేపీఎన్ ఫ్రెష్ పక్కన, ఉమా హైట్స్ ఎదుట 25 ఏండ్లు బస్ స్టాప్ వినియోగంలో ఉందన్నారు. కొందరు నాలుగు నెలల క్రితం అక్కడి బస్సు షెల్టర్ ను తొలగించి అందులో టీ పాయింట్, మెకానిక్ షాపులను నిర్వహిస్తూ వ్యాపారాలు చేస్తున్నారన్నారు. దీంతో ఇక్కడి నుంచి రాకపోకలు సాగించే వారితో పాటు విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి బస్‌స్టాప్ (షెల్టర్) ను పునరుద్ధరించాలని కోరారు. కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన వారిలో మాజీ వార్డు సభ్యులు మహేందర్, ఖాదరయ్య, ప్రవీణ్ గౌడ్, సలీం ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో మూడో అంతస్తు నుంచి దూకిన యువకుడు

దుండిగల్ : అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు బిల్డింగ్ పైనుంచి దూకి తీవ్ర గాయాల పాలయ్యాడు. సూరారం పీఎస్ పరిధిలో జరిగ ఘటన వివరాలు పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా, కోహిర్ మండలం, పైడి గుమ్మాలకు చెందిన గడిసింగాపురం అనంతయ్య కొడుకు చిట్టి రాజు. మల్లారెడ్డి వైద్యశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న అతడు సూరారం కాలనీలోని మొదటి ఓం జండా సమీపంలో ఉంటున్నాడు. మంగళవారం చిట్టి రాజు శ్రీరాం నగర్ లోని అపార్ట్‌మెంట్ మూడో అంతస్తు నుంచి దూకి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు చికిత్స కోసం మల్లారెడ్డి వైద్యశాలకు తరలించారు. చిట్టి రాజు శ్రీరాంనగర్ కాలనీకి రావాల్సిన అవసరం ఏముంది..? అనేది ప్రశ్నార్థకరంగా మారింది. తనతో వైద్యశాలలో పని చేసే ఓ మహిళ ఇంటికి రాగా ఈ ఘటన జరిగినట్టు పోలీసులు భావిస్తున్నారు. కాగా తనంతట తాను బిల్డింగ్ 3వ అంతస్తు నుంచి దూకాడా..? ఎవరైనా తోసేసారా అనేది తెలియాల్సి ఉంది అంటున్నారు. ఇప్పటివరకు పోలీసులకు ఎవరు ఫిర్యాదు చేయలేదని పేర్కొంటున్నారు.

చికిత్స పొందుతూ .. గుర్తుతెలియని వ్యక్తి మృతి

దుండిగల్, ఫిబ్రవరి 25: గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బాచుపల్లి పీఎస్ పరిధిలో మంగళవారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేటలోని రాజీవ్ గృహకల్ప సముదాయం నుంచి ప్రగతి నగర్ వెళ్లేదారిలోని హారిక ఫస్ట్ ఎయిడ్ సెంటర్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం సాయంత్రం నడుచుకుంటూ వస్తు రోడ్డు పక్కన పడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు గాంధీ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి చనిపోయినట్లు పోలీసులు పేర్కొన్నారు. అతడికి 35 ఏండ్లు ఉంటాయని, ఒంటిపై గ్రీన్ షర్ట్, బ్లాక్ ప్యాంట్ ఉన్నట్లు తెలిపారు. మద్యం మత్తులో తొలి రోడ్డుపై పడి గాయాలు కావడంతో మరణించినట్లు స్పష్టం చేశారు. వివరాలు తెలిసినవారు 8333 99 3552, 9491 0 6 0942, 9490 47 1971 కు , బాచుపల్లి పీఎస్‌లో తెలుపాలని కోరారు.

డ్రగ్స్‌రహిత సమాజం విద్యార్థులతోనే సాధ్యం

జగద్గిరిగుట్ట : డ్రగ్స్ రహిత సమాజం విద్యార్థులతోనే సాధ్యమని న్యాబ్ అధికారులు అన్నారు. జగద్గిరిగుట్ట పీఎస్ పరిధి ఎల్లమ్మ బండ, శంషిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం టీజీ న్యాబ్ నేతృత్వంలో అవగాహన కల్పించారు. డీఎస్పీ పుష్పన్, ఇన్‌స్పెక్టర్ రామునాయక్ ఉపాధ్యాయులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి వాల్ పోస్టర్లు, కరపత్రాలు పంచారు. జగద్గిరిగుట్ట సీఐ నరసింహ, ఎస్సై రాజేశ్ పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

మియాపూర్ : రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించాలని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. . జె.పి. నగర్ లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కాలనీవాసులతో కలిసి శ్రీకాంత్ మంగళవారం పరిశీలించారు. రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ వంటి వసతులతో కాలనీలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ఉత్తమ డివిజన్ గా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమని కార్పొరేటర్ అన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు రామాంజనేయ రెడ్డి ,రామారావు, సంపత్ రెడ్డి, అశోక్, వెంకట్ రెడ్డి, డాక్టర్ సుధాకర్, ఓంకార్ శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

PASSPORT LOST
I, **Kuna Pratap Vishal Goud** S/o **Pratap Kuna Manikyam** H.No. 4-6/46,47 CPR Colony Quthbullapur Medchal Malkajgiri District Pin 500055. Lost my Original Passport No. L6966873 on 21-02-2025 near Suraram Sub Register Office if anybody found Call.
Ph: 9989998098